# యాదగిరీశుడికి నిత్యారాధనలు



యాదగిరిగుట్టలో స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 6 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో స్వామి, అమ్మవార్ల నిత్యారాధనలు అత్యంత వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో నారసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామివారికి నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. గంటన్నరపాటు అర్చక బృందం శాస్త్రోక్తంగా కల్యాణతంతు జరిపారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి తిరువారాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. రాత్రి ప్రధానాలయ ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిగాయి. కార్తీకమాసం సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు, దీపారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 8 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.15,30,670 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

# సైన్స్ ఫెయిర్‌కు.. సిద్ధమవ్వండిలా!

- ఈ నెల చివరన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్, జనవరిలో రాష్ట్రస్థాయి ప్రదర్శన
- 'సుస్థిర అభివృద్ధికి సాంకేతిక' ప్రధానాంశంగా ఏర్పాటు
- బీఈడీ, డీఈడీ విద్యార్థులకు అవకాశం



గత సంవత్సరం రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు హాజరైన విద్యార్థులు

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 6 : విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను వెలికి తీసేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలను నిర్వహిస్తున్నది. ఈ విద్యాసంవత్సరం 49వ జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ సైన్స్, గణితం, పర్యావరణ ప్రదర్శన (జేఎన్‌ఎన్‌ఎస్‌ఎంఈఈ)ను ఈనెల చివరి వారంలో జిల్లా స్థాయిలో, జనవరిలో రాష్ట్రస్థాయిలో నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రదర్శనల్లో భాగంగా 'సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సొసైటీ 2023-24' ప్రధాన అంశంతో పాటు 5 ఉప అంశాలపై ప్రదర్శనలు చేయనున్నారు. ఎంపిక చేసిన అంశంపై విద్యార్థులకు సెమినార్లు కూడా నిర్వహించడం జరుగుతుంది. గతంలో ఇన్‌స్పైర్ ప్రదర్శనలో పాల్గొన్న 97 మంది విద్యార్థుల ప్రాజెక్టులను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేయనున్నారు.

## ప్రధాన అంశం.. ఉప అంశాలు

ఈ ప్రదర్శనకు సంబంధించి 'సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సొసైటీ'ని ప్రధాన అంశంగా నిర్ణయించారు. విద్యార్థులు దీనిపై ప్రదర్శనలు రూపొందించాల్సి ఉంటుంది. ప్రధాన అంశంతో పాటు 5 ఉప అంశాలను ప్రదర్శనలు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది.

1)ఆరోగ్యం
2)లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్)
3)వ్యవసాయం
4) కమ్యూనికేషన్ అండ్ ట్రాన్స్‌పోర్ట్
5)కంప్యూటేషనల్ థింకింగ్

జిల్లా, రాష్ట్రస్థాయి ప్రదర్శనల్లో విద్యార్థులకు మిల్లెట్స్ ఫర్ హెల్త్, సుస్థిరాభివృద్ధిలో మొక్కల పాత్ర అంశాలపై సైన్స్ సెమినార్ ఉంటుంది. అలాగే క్విజ్ పోటీలు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, చిత్రలేఖనం, వ్యాసరచన, పోస్టర్ పోటీలు, పాపులర్ సైన్స్‌పై ప్రసంగాలు, సైన్స్ సంబంధిత, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## ఉపాధ్యాయ విభాగంలో...

విద్యార్థులను ప్రదర్శనలకు సమాయత్తం చేస్తూనే వినూత్న విద్యా బోధన, అభ్యసన సామగ్రిపై ఉపాధ్యాయులు ప్రదర్శనలు తయారు చేయవచ్చు. డీఈడీ, బీఈడీ శిక్షణ పొందుతున్న ఛాత్రోపాధ్యాయులు కూడా వారి శాస్త్రీయ నైపుణ్యాలను ప్రదర్శించవచ్చు.

## ప్రదర్శన లక్ష్యాలు...

- విద్యార్థుల్లో శాస్త్రీయ, సాంకేతికతను వెలికి తీయడం
- సైన్స్, గణిత విషయాలు మన చుట్టూ ఉన్నాయనే అనుభూతిని పిల్లల్లో కల్పించడం.
- విజ్ఞానాన్ని నేర్చుకోవడం, భౌతిక, సామాజిక పర్యావరణ వ్యవస్థలోని సమస్యలను అభ్యసన ప్రక్రియ ద్వారా తెలుసుకోవడం.
- విజ్ఞాన శాస్త్రం, గణితం ఎలా అభివృద్ధి చెందాయో విశ్లేషించడం, వైవిధ్య మానవాళి, మన సంస్కృతి, సంప్రదాయాలు, సమాజం గురించి తెలియజేయడం.
- వాతావరణంలో మార్పులు, వ్యవసాయ రంగంలో చోటు చేసుకున్న నూతన మార్పులు సవాళ్లను ఎదుర్కోవడంలో సైన్స్, గణితం యొక్క ప్రాధాన్యతను తెలుపడం.
- విద్యార్థులకు పర్యావరణంపై చైతన్యాన్ని పెంచడం, వినూత్న అలోచనలు, ఆవిష్కరణలను గుర్తించడం.

### విద్యార్థులను ప్రోత్సహించాలి



ఈ నెల చివరి వారంలో జరిగే జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనలో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించాలి. ఇప్పటికే జిల్లాలోని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ప్రత్యేక అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ఈ ప్రదర్శనలో ప్రభుత్వ, జడ్పీ, ప్రైవేటు, గురుకులాలు, కేజీబీవీ, మైనార్టీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చు.

– దేవరాజ్, జిల్లా సైన్స్ అధికారి



తుఫాన్ ధాటికి మేళ్లచెర్వు శివారులో నేలవాలిన వరి

# ఉమ్మడి జిల్లాపై 'మిగ్‌జాం' ప్రభావం

- నల్లగొండ జిల్లాలో సగటున 16.1 మిల్లీమీటర్ల వర్షపాతం
- అత్యధికంగా దామరచర్లలో, అత్యల్పంగా నాంపల్లిలో నమోదు
- పలు ప్రాంతాల్లో నేలవాలిన పంట పొలాలు

నీలగిరి, డిసెంబర్ 6 : బంగాళాఖాతంలో ఏర్పడిన మిగ్‌జాం తుఫాన్ ప్రభావం ఉమ్మడి నల్లగొండ జిల్లాపై పడింది. బుధవారం నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. అత్యధికంగా దామరచర్ల మండలంలో 44.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా నాంపల్లిలో 0.7 మిల్లీమీటర్లు నమోదైంది. మంగళవారంతో పోలిస్తే తుఫాన్ తీవ్రత బలహీనపడింది. తెల్లవారుజామున చలిగాలులు వీచినప్పటికీ ఉదయం 8 గంటల ప్రాంతంలో సూర్యుడి ప్రభావంతో చలి తీవ్రత తగ్గింది. తుఫాన్ కారణంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు నల్లగొండ జిల్లాలో సగటున 16.1 మిల్లీమీటర్లు నమోదైంది. అయితే జిల్లాలో ఇప్పటివరకు 643.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటివరకు 530 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది.

## దామరచర్ల మండలంలో అత్యధికం..

జిల్లాలోని దామరచర్లలో అత్యధికంగా 44.8 మిల్లీమీటర్ల వర్షపాతం కురువగా, అత్యల్పంగా నాంపల్లిలో 0.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మిర్యాలగూడలో 41.4, త్రిపురారం 38.8, అడవిదేవులపల్లి 37.2, మాడ్గులపల్లి 36, వేములపల్లి 35.1, తిరుమలగిరి(సాగర్) 33.1, కేతేపల్లి 30.2, నిడమనూర్ 28.6, నకిరేకల్ 26.1, అనుముల 25.2, తిప్పర్తి 20.3, శాలిగౌరారం18.6, పెద్దవూర 16, కట్టంగూర్ 13.6, చందంపేట 9.5, పీఏపల్లి 8.9, నల్లగొండ 8.8, నార్కట్‌పల్లి 7.9, చిట్యాల 6.7, గుర్రంపోడ్ 4.2, కనగల్ 4, నేరేడుగొమ్ము 3.4, గుండ్లపల్లి 3, కొండమల్లేపల్లి 2.4, చండూర్ 2.3, గట్టుప్పల్ 2, మునుగోడు 1.9, చింతపల్లి 1.7 మర్రిగూడ 1.5, దేవరకొండ 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## నేలవాలిన పంటలు..

అనంతగిరి/మేళ్లచెర్వు : మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో మండలంలోని ఖానాపురం గ్రామానికి చెందిన కౌలు రైతు మీసాల ఏకోబు బంతి పంట దెబ్బతిన్నది.

వేగంగా వీచిన గాలులకు పంట నేలకొరిగింది. పూలు చేతికొచ్చే సమయానికి నేలపాలవడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు. అలాగే మేళ్లచెర్వు శివారులోని పలువురు రైతుల వరి పొలాలు నేలవాలాయి.



అనంతగిరి : ఖానాపురంలో నేలకొరిగిన బంతి తోట



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నల్లగొండ డీఈఓ భిక్షపతి

# హోరా హోరీగా రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు

నల్లగొండ రూరల్, డిసెంబర్ 6: నల్లగొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 4 నుంచి నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్-14,17 బాలబాలికల కరాటే పోటీలు బుధవారం హోరాహోరీగా కొనసాగాయి. పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలకు 80 మంది శిక్షకులు, 30 మంది న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీలను డీఈఓ భిక్షపతి పరిశీలించి పలువురు విజేతలకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వాసుదేవరావు, శిక్షకులు పాల్గొన్నారు.